క్లుప్తంగా

వైభవుడికి విశేష సేవలు



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రోడ్డు మధ్యలో గొయ్యి



సీతంపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల రోడ్డులో ప్రమాదకరంగా గొయ్యి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట ప్రాథమిక పాఠశాల రోడ్డులో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో, వర్షం పడినపుడు గొయ్యి కనిపించక వాహన చోదకులు నిత్యం ఎవరో ఒకరు గోతిలో పడి ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం 26, 43, 45, 53, 54 వార్డులకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పంపిణీ చేశారు. 9 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6,34,006 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు సునీల్ అగర్వాల్, కార్పొరేటర్లు కంపా హనోకు, ముక్కా శ్రావణి, ముక్కా కిషోర్, ఆనందబాబు, రాంబాబు, కార్తీక్, మోహన్, శ్రీదేవి, నాగారజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీకరించొద్దని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటించనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె.రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడం వెనుక గల మతలబు ఏంటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి.నడ్డా విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని, విభజన చట్టం హామీలు అమలు చేస్తామని, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు.

బాగుపడే దారేది..!

దొండపర్తి, రైల్వే న్యూకాలనీల ప్రధాన రహదారులు గోతులమయం

రాకపోకలకు అవస్థలు పడుతున్న జనం

కానరాని మరమ్మతులు.. పట్టని పాలకులు



రాళ్లు తేలి గోతులతో ప్రమాదకరంగా దొండపర్తి - రైల్వే న్యూకాలనీ మెయిన్ రోడ్డు

తాటిచెట్లపాలెం: స్థానిక ప్రధాన రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. ఏ రోడ్డును చూసినా ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వాటిపైనే జనం పడిలేస్తూ.. అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా దొండపర్తి రోడ్డులో అడుగుకో గొయ్యి అన్నట్లుగా తయారైంది. దొండపర్తి నుంచి రైల్వే న్యూకాలనీకి వెళ్లే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా గోతులు, రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్లపై ప్రయాణించడం వల్ల తమ వాహనాలు దెబ్బతింటున్నాయని, పలు ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర కాలం గడిచినా.. నేటికీ రహదారులను బాగుచేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు.



శివాలయం ముందు బురదమయంగా రహదారి

తవ్వి వదిలేశారు..

రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారి తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్ నుంచి న్యూకాలనీ ఆర్చి వరకు విస్తరించి ఉంది. ఈ మార్గంలో నిత్యం కొన్ని వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డును 24/7 మంచినీటి పైప్‌లైన్ల పనుల నిమిత్తం తవ్వి వదిలేశారు. అసలే చిన్న రోడ్డు, ఆపై దానిని కూడా తవ్వేయడంతో మరింత ఇరుగ్గా మారింది. వానొస్తే ఈ ప్రాంతం మట్టి రోడ్డు కన్నా అధ్వానంగా తయారవుతుంది. వర్షపు నీరు నిల్వ ఉండిపోయి రోడ్డంతా బురదతో నిండిపోతుంది. చాలా కాలం తరువాత రైల్వే న్యూకాలనీలో తవ్విన రహదారులను పూడ్చారు. ఇప్పుడు మళ్లీ ఏవో కేబుల్ పనుల నిమిత్తం తవ్వి, వాటి గుండా కేబుల్స్ నడిపి, వాటిని కొన్ని చోట్లు చుట్టలుగా చుట్టి వదిలేశారు. ఇది రోడ్డుపైనే ఉండటంతో పొరపాటున ఎవరైనా చూడకుంటే పడిపోయే ప్రమాదముంది. ఈ మార్గంలో ఇలా చాలా చోట్ల రోడ్డు మీదే కేబుళ్లు చుట్టలుగా ఉండటంతో స్థానికులు భయపడుతున్నారు.



రాజీవ్‌గాంధీ జంక్షన్ వద్ద తవ్వి వదిలేసిన న్యూకాలనీ రోడ్డు



రైల్వే న్యూకాలనీ మెయిన్ రోడ్డులో ప్రమాదకరంగా కేబుళ్లు

భయం భయంగా ప్రయాణం

రైల్వే న్యూకాలనీ ప్రధాన రహదారి వెంబడి పలు వ్యాపార సముదాయాలు, చిరు వ్యాపారాలు, తోపుడుబళ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు న్నాయి. మరమ్మతుల కోసం మెయిన్ రోడ్డును తవ్వేయడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానికులు, వాహన చోదకులతోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఇక్కడికి వస్తున్న తల్లిదండ్రులు భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రహదారులను వెంటనే బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



నిమజ్జన ఊరేగింపులో గణనాథుడు

మద్రిపాలెం: 18 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. 51వ వార్డు సీతన్న గార్డెన్స్ ప్రిన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గణపతి విగ్రహ నిమజ్జనం సందర్భంగా వీధుల్లో పండగ వాతావరణం నెలకొంది. డప్పులు, పాటలు, డ్యాన్సులతో జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అందరినీ చల్లగా చూడయ్యా.. మళ్లీ రావయ్యా గణపయ్యా అంటూ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున స్థానికులు కోరుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా గణపతి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని, ఈ ఏడాది 18 రోజుల పాటు అత్యంత వైభవంగా విశేష కార్యక్రమాల నడుమ ఉత్సవాలు నిర్వహించామని తెలిపారు. విశాఖ సముద్రంలో స్వామి విగ్రహాన్ని నిమజ్జనం చేశామన్నారు.

త్వరితగతిన బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న బాణాల శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆదేశాలతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుల ఆధ్వర్యంలో శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో 42, 43, 45 వార్డుల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ స్థాయిలో కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. వార్డుల్లోని సీనియర్ నాయకులు సమన్వయంతో త్వరితగతిన వార్డు స్థాయి కమిటీ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ పదవులతో సంబంధం లేకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పార్టీ సరైన సమయంలో గుర్తింపు ఇస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, 42వ వార్డు అధ్యక్షుడు బీశెట్టి ప్రసాద్, 43వ వార్డు అధ్యక్షుడు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్య స్పందన



బాలికకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ షిరీన్ రెహమాన్

మహారాణిపేట: ఆడపిల్లల్లో క్యాన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ట్రస్ట్, చైతన్య స్రవంతి సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వ్యవధిలో ఆడపిల్లలకు రెండు డోస్‌ల వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. సామాజిక సేవా దృక్పథంతో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. 9 నుంచి 14 ఏళ్ల వయసు గల ఆడపిల్లల కోసం నిర్వహించిన గర్భకోశ ముఖ ద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ నెల 13 నుంచి 16 వరకు టీకాలు వేయాల్సి ఉండగా.. తొలి రోజే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారు. 670 మంది ఆడపిల్లలు తమ పేర్లు ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. శిబిరంలో లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి రవిచంద్ర, డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంచేలా సాహిత్యం



కవి రెడ్డి రామకృష్ణను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

మురళీనగర్: సాహిత్యం మానవతా విలువలు పెంపొందించేదిగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సాహితీ స్రవంతి విశాఖ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సాహితీ స్రవంతి నెలవారీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్వేషాలనూ, వైషమ్యాలనూ రెచ్చగొట్టేదిగా సాహిత్యం ఉంటే సమాజంలో అలజడులు రేగుతాయన్నారు. ప్రముఖ కవి, విశ్లేషకుడు రెడ్డి రామకృష్ణ పదవీ విరమణ సందర్భంగా ఆయనను సత్కరించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ మాట్లాడుతూ రామకృష్ణ రచించిన 'ముద్దుబిడ్డ' కవితను వినిపించారు. పండితులకు మాత్రమే పరిమితమైన గ్రాంథిక సాహిత్యాన్ని వ్యవహారికంగా మార్చి సామాన్యుల చెంతకు చేర్చిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం నిర్వహించిన సాహితీ సమ్మేళనంలో భాగంగా మాట, పాట, పద్యం, కవిత అనే నాలుగు సాహితీ ప్రక్రియలతో కవులు తమ రచనలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎం.ఆనందశర్మ, డి.ఎస్.కుమార్, వై.ఉమాశంకర్, ఎ.సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, డి.షణ్ముఖరావు, కె.గోపీ నాయుడు, కన్వీనర్ పెంటకోట రామారావు పాల్గొన్నారు.

హోంగార్డ్ కుటుంబానికి కార్పొరేటర్ పూర్ణిమ ఆసరా



హోంగార్డు లక్ష్మణరావు భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: గాజువాక ప్రాంతానికి చెందిన హోంగార్డు లక్ష్మణరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తక్షణం స్పందించారు. లక్ష్మణరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదును బాధితుడి భార్యకు అందించడమే కాకుండా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మణరావు పూర్తిస్థాయిలో కోలుకోవాలని పూర్ణిమ ఆకాంక్షించారు. శనివారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సమక్షంలో లక్ష్మణరావు భార్యకు కార్పొరేటర్ పూర్ణిమ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకుడు వేళంగిణీరావు, ఎస్‌ఐ భాస్కరరావు, సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాన మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓనం వేడుకలు

సిద్ధమైన కేరళ కళా సమితి



మొదటి బహుమతి పొందిన కథాకళి ముగ్గు



సద్య విందు భోజనం కోసం కూరగాయలు సిద్ధం చేస్తున్న మహిళలు

మురళీనగర్: నగరంలోని కేరళీయులు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఓనం వేడుకలు మురళీనగర్ బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వీరి ఆరాధ్య దైవం మహాబలి చక్రవర్తిని పూజిస్తారు. ఓనం వేడుకలకు కళాక్షేత్రాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వేడుకలు నిర్వహిస్తామని కేరళ కళా సమితి జనరల్ సెక్రటరీ కె.హరిదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కేరళీయుల సంప్రదాయ ఉత్సవం ఓనం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. కేరళ చలకుడీ ఎంపీ బెన్నీ బెహనన్, మావిలెక్కిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ అరుణ్‌కుమార్, ఇతర పెద్దలు, నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి కేరళీయులు పాల్గొంటారన్నారు. చండ మేళం, పులి వేషాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. 29 రకాల వంటకాలతో కూడిన కేరళ సద్య ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం రేసవానిపాలెంలో ఉన్న కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలో ఈ ప్రచార రథం తిరుగుతుందన్నారు. ప్రజా సమూహాలు, మురికివాడల్లో ఈ రథం పర్యటిస్తుందన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లు, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ భద్రి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌వేలో చెత్త పారబోత



రవీంద్రనగర్‌లో డంపర్ బిన్ పక్కనున్న వాహనంలో పడేసిన చెత్త

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సబ్ వే రోడ్డులోని డంపర్ బిన్‌లో వేయాల్సిన చెత్తను.. అక్కడ నెలల తరబడి నిలిపి ఉంచిన వాహనాల్లో వేస్తున్నారు. కొందరు స్థానికులు, వ్యాపారులు చెత్తను తీసుకొచ్చి డంపర్ బిన్‌లో కాకుండా వాహనాలపై పడేస్తుండటంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు

ఇగ్నోలో 15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ధర్మారావు తదితరులు

ఎంవీపీ కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఇగ్నో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 15 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ విశాఖ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. శనివారం ఉదయం ఇగ్నో విశాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యాలయం పరిసరాలను శుభ్రపరచడంతోపాటు దత్తత గ్రామం అయ్యన్నపాలెంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలోని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

డంపింగ్ యార్డులా రాజేంద్రనగర్ పార్కు



రాజేంద్రనగర్ పార్కులో పేరుకుపోయిన చెత్త



పార్కులో డంప్ చేసిన బడ్డీలు

సీతంపేట: ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు డంపింగ్ యార్డుగా మారింది. జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాల ఎదురుగా ఉన్న పార్కు స్థలం చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండి రోత పుట్టిస్తోంది. సమీప ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను ఇక్కడ డంప్ చేయడం, కొంత మంది చెత్తను పడేయడంతో పెద్ద ఎత్తున పేరుకుపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసనతో స్థానికులు, కళాశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఎక్కడ బడ్డీలు తొలగించినా ఇక్కడికే తరలిస్తున్నారు. పార్కు స్థలంలో పదుల సంఖ్యలో బడ్డీలు పడవేశారు. గతంలో పార్కు స్థలంలో పడేసిన బడ్డీలు తగలబడ్డాయి, అప్పటి నుంచి నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరం మధ్యలో కోట్ల విలువైన స్థలం నిరుపయోగంగా, డంపింగ్ యార్డుగా మారిపోవడంపై పలువురు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని ప్రజా ప్రయోజనానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.